క్లుప్తంగా

నేటి నుంచి 'నిథమ్'లో అంతర్జాతీయ సదస్సు

రాయదుర్గం: పర్యాటక, అతిథ్య కేంద్రం గచ్చిబౌలిలోని 'నిథమ్'లో మూడు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు నిథమ్‌లోని ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో జరిగే ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా. కేంద్ర పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సివి శంకర్‌రెడ్డి, టీఎస్‌టీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ బి మనోహర్, టీసీఈఐ అధ్యక్షులు బలరామ్‌బాబు, నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ చిన్నంరెడ్డితో పాటు పలువురు ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొంటారు. కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు 'మనూ'లో సెమినార్

రాయదుర్గం: మనూలో అరబిక్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఒకరోజు ప్రత్యేక సదస్సు జరుగుతుందని అరబిక్ విభాగం హెడ్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్ జైసీ తెలిపారు.'భారతదేశంలో అరబిక్ భాష: సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై ఉదయం 10 గంటలకు ఎస్‌ఎల్‌ఎల్ అండ్ ఐ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అలీమ్ అశ్రఫ్ జైసీ, డాక్టర్ జావెద్ నదీమ్ నద్వీ, డాక్టర్ మహ్మద్ షాకీర్ రజా పాల్గొంటారన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎలమ్మబండ, సుభాష్ చంద్రబోస్‌నగర్‌లో ఓమ్ని హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, పల్స్ రేట్ తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషకాహారాన్ని తీసుకోవాలని, వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సీఓఓ మంజునాథ్, కో ఆర్డినేటర్ సురేంద్ర, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రవి కుమార్ యాదవ్

గచ్చిబౌలి: మారబోయిన రాజ్‌కుమార్ వర్ధంతిని పురస్కరించుకొని శేరిలింగంపల్లి సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. బుధవారం మసీద్‌బండలో మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతి యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్ యాదవ్‌లు రాజ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కొండాపూర్ ఆస్పత్రిలో గర్భిణులకు పండ్ల పంపిణీ, విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



గచ్చిబౌలి: గుండెపోటుతో నేలకూలినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలో కొండాపూర్ టీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఇటీవల గుండెపోటుకు గురైన వారికి వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాపాయం తప్పిన ఘటనలు చోటు చేసుకున్న క్రమంలో టీఎస్‌ఎస్‌పీ పోలీసులకు ఐబీటీపీ మొయినాబాద్, యూనిట్ మెడికల్ ఆఫీసర్ జ్యోతిరావు పులే అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ఎస్‌టీయూ టీఎస్ ముందుంటుందని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్ అన్నారు. బుధవారం హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావును గెలిపించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి పండరి తదితరులు పాల్గొన్నారు.

జ్యువెలరీ స్టోర్ ప్రారంభం

మాదాపూర్: ప్రముఖ డిజైనర్‌లు రూపొందించిన బంగారు ఆభరణాలు, డైమండ్ నగల స్టోర్‌ను మాదాపూర్‌లో ఆ స్టోర్ వ్యవస్థాపకురాలు గౌరి బుధవారం ప్రారంభించారు.

జాతీయ, అంతర్జాతీయ చిత్రమయి..



మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ



చిత్రాలను ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన గ్యాలరీలు



మాదాపూర్: జాతీయ, అంతర్జాతీయ చిత్రాల ప్రదర్శనకు నెలవుగా మారింది మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ. 2.40 ఎకరాలలో ఏర్పాటు చేసిన ఈ గ్యాలరీలో సంవత్సరం పొడవునా చిత్ర ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇందులో 10 గ్యాలరీలు ఉండగా ఫ్యాషన్‌షోలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక స్టేజీ కూడా ఉంది. అలాగే పుస్తకావిష్కరణకు, అవగాహన సదస్సులకు 200 మంది కెపాసిటీతో కూడిన ఆడిటోరియం అందుబాటులో ఉంది. అలాగే కల్చరల్ కాంప్లెక్స్‌లో దాదాపు 500 మందితో కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు. ఇక కళాకారులు తమ చిత్రాలను ప్రదర్శించుకోవడానికి ముందుగానే తేదీలను బుక్ చేసుకోవచ్చని ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి తెలిపారు. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే..

ప్రశ్న: ఆర్ట్‌గ్యాలరీ ప్రత్యేక ఏమిటి?

జ: నగరంలో అతిపెద్ద ఆర్ట్‌గ్యాలరీ చిత్రమయి స్టేట్‌ఆర్ట్ గ్యాలరీ. చిత్రకారులు తాము వేసిన పెయింటింగ్‌లను ఇక్కడ ప్రదర్శించుకోవచ్చు. ప్రముఖులు చుట్టుపక్కల ఉన్నందున పెయింటింగ్‌ల అమ్మకాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది.

ప్రశ్న: కళాకారులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారా?

జ: కళాకారులకు ఇక్కడే ప్రత్యేక ప్రదేశాన్ని కేటాయించాము. పెయింటింగ్స్, స్కల్పచర్స్, ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లను నిర్వహించుకునేలా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: విక్రయాలకు స్టోర్ ఏర్పాటు చేస్తున్నారా..

జ: ఆర్ట్‌గ్యాలరీలో చిత్రాల విక్రయాల కోసం స్టోర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. పెయింటింగ్‌లతో పాటు పలురకాల వస్తువులను అమ్మవచ్చు. ఇది త్వరలో అందుబాటులోకి రానుంది.

ప్రశ్న: ఆర్ట్‌గ్యాలరీలో చేపడుతున్న మార్పులు ఏమిటి?

జ: గ్యాలరీని పూర్తి స్థాయిలో బాగు చేయిస్తున్నాం. కొత్త ఏసీలు, మంచినీటి వసతి కల్పిస్తున్నాం. గ్యాలరీ పరిసర ప్రాంతాలు ఆహ్లాదంగా ఉండేందుకు ప్రత్యేకంగా చిత్రాలు వేస్తున్నారు. స్కల్పచర్స్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: చిత్ర ప్రదర్శనకు బుక్ చేసుకునే విధానం గురించి..

జ: కళాకారులు తమ చిత్రాలను ప్రదర్శించుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఎన్ని రోజులు కావాలి అనే దానికి చార్జీలు ఉంటాయి. మరిన్ని వివరాలకు ఫోన్ 9100022958లో సంప్రదించవచ్చు.

ప్రశ్న: సంవత్సరానికి ఎన్ని ప్రదర్శనలు నిర్వహిస్తారు?

జ: దాదాపు 50 నుండి 55 కార్యక్రమాలు జరుగుతాయి. ఇందులో ముఖ్యంగా మహిళ దినోత్సవం, గణేశ్ ఉత్సవాలు, ఆలిండియా క్రాఫ్ట్ కాంపిటీషన్, అంతర్జాతీయ ఫొటో ఫెస్టివల్ తదితరాలుంటాయి.

ప్రశ్న: గ్యాలరీ టైమింగ్స్ ?

జ: ఉదయం 10 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు గ్యాలరీ సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. గ్యాలరీలో ప్రదర్శించిన చిత్రాలను సందర్శకులకు వివరించేందుకు ఎవరికి వారి క్యూరేటర్ అందుబాటులో ఉంటారు. సందర్శకులకు మంచి వసతులున్నాయి.

విజేత నమో వెంకటేశాయ టీమ్



క్రీడాకారులతో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భిక్షపతియాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి లేగల గ్రౌండ్‌లో ఆర్.కే.వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజ్‌కుమార్‌యాదవ్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నమో వెంకటేశాయ టీమ్ నిలిచింది.బుధవారం నిర్వహించిన ముగింపు వేడుకలకు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్‌లు హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన అన్‌స్టాపబుల్ 11 టీమ్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ద సిరీస్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌లకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్‌యాదవ్, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లేగల వెంకట్‌రెడ్డి, నాయకులు నాగులు గౌడ్, అనిల్ యాదవ్, రాఘవేంద్రరావు, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

● మహిళకు పారా గాంగ్లియోమా కణితి తొలగింపు



జాంబియా మహిళతో కిమ్స్ వైద్యులు

గచ్చిబౌలి: జాంబియాకు చెందిన మహిళకు కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేశారు. పారా గాంగ్లియోమా కణితిని తొలగించినట్లు ఎండోక్రైన్ శస్త్ర చికిత్స నిపుణురాలు డాక్టర్ రమ్య వలివేరు తెలిపారు. పది లక్షల మందిలో ఇద్దరు ఈ కణితితో బాధపడతారని, రక్తపోటు నియంత్రణలో లేకపోవడం.. తలనొప్పి, గుండె దడ, ఆందోళన తదితర సమస్యలు ఉండటంతో రోగ నిర్ధారణ పరీక్షలు ద్వారా ఉదర భాగంలో కణితి ఉన్నట్లు అక్కడి డాక్టర్లు గుర్తించారని, ఆ మహిళను జాంబియా ప్రభుత్వం కిమ్స్ ఆస్పత్రికి పంపించిందన్నారు. ఎండోక్రైనాలజీ విభాగం కన్సల్టెంట్ డాక్టర్ కృష్ణారెడ్డి నేతృత్వంలో గుండె, మూత్ర పిండాలకు ఇబ్బంది కల్గకుండా కణితిని తొలగించామన్నారు. శస్త్ర చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేసినట్లు చెప్పారు.

సమాజం నుంచి జవాబు ఆశించేదే రచన



మాట్లాడుతున్న ఏసుదాసన్

పటాన్‌చెరు టౌన్: దళితుల రచనలు సమాజం, సంస్కృతి నుంచి సమాధానాన్ని ఆశిస్తాయని కేరళ కొట్టాయం లోని సీఎంఎస్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ టీఎం ఏసుదాసన్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(జీఎస్ హెచ్ఎస్) ఆధ్వర్యంలో వ్యవహారిక పత్రికలు, దళిత రచనలు, వెలువరించడంలోని సాదక బాధకాలు అనే అంశంపై బుధవారం నిర్వహించిన జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి హాజరై మాట్లాడారు. ప్రతి కులం పేరుతో సంఘాలు ఉన్నాయన్నారు. దళిత పత్రికలు అరుదుగా వెలువడ్డా కనుమరుగయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేవీ పవార్, కల్యాణి ఠాకూర్ చరల్, నకుల్ మాలిక్, ప్రొఫెసర్ రేఖా మెశ్రమ్, ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ రాజ్‌కుమార్, హరీశ్ మంగళం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత తప్పనిసరి

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్‌రాజు నగర్ కాలనీలో రూ.9లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. హైదర్‌నగర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఆయన అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాంట్రాక్టర్ బాబురావు, కాలనీవాసులు వేదమూర్తి, చైతన్య, రాయపరెడ్డి, శ్రీనివాస్, ఉమాశంకర్, శేషయ్య పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానంటూ సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి



ఖాజాగూడలో సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

గచ్చిబౌలి: ఆత్మహత్య చేసుకుంటానంటూ కడ్తాల్‌కు చెందిన రాజుగౌడ్(39) బుధవారం ఖాజాగూడలో సెల్‌టవర్ ఎక్కాడు. దీంతో రాయదుర్గం పోలీసులు, మాదాపూర్ అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. తన భార్యా పిల్లలను రప్పించాలని లేకపోతే కిందకు దూకేస్తానని హెచ్చరించాడు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతనికి నచ్చజెప్పి కిందకు దింపారు. అనంతరం అతని స్వస్థలం కడ్తాల్‌కు పంపించివేశారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇదిలావుండగా గతంలో కూడా పలుమార్లు ఇలాగే చేసినట్లు పోలీసులు గుర్తించారు.

మెగా జాబ్ మేళా కరపత్రం ఆవిష్కరణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 11న నిర్వహించనున్న మెగా జాబ్ మేళా కరపత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే జర్నలిస్టు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివేక్‌నగర్ కాలనీ ద్వాదశ జ్యోతిర్లింగ శివాలయం ప్రాంగణంలోని పుల్లూరి వాసుగారి కల్యాణ మండపంలో ఈ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈజాబ్ మేళాలో 56 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి నుంచి ఎంబీఏ విద్యార్హత ఉన్న వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఐడీఏ బస్తీకి చెందిన రమేశ్ గౌడ్(32) బుధవారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేత వీ.ప్రవీణ్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వీవీఆర్ ఫౌండేషన్ నుంచి మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో శారద, సుజాత, నవీన్ రెడ్డి, విక్కీ, కృపాకర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో కంటి వెలుగు కేంద్రం



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో బుధవారం కంటి వెలుగు కేంద్రం నిర్వహించారు. సీనియర్ సిటిజన్‌లు, పరిసర ప్రాంతాల వారు కంటి పరీక్షలు చేయించుకున్నారు.

దళితుల అభ్యున్నతికే దళితబంధు

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): దళితుల అభ్యున్నతికే సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అనంతారం నివాసి రామగుల్ల పుష్పమ్మకు మంజూరైన ఆటోను బుధవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బచ్చుగూడెం, కొడకంచి, అనంతారం గ్రామాలను ఎంపిక చేసి 100 మంది లబ్ధిదారులకు వివిధ యూనిట్లను అందజేశారు. దళితులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుమార్ గౌడ్, ఎంపీడీఓ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'మనూ' అభివృద్ధిలో కేంద్రం, యూజీసీ పాత్ర ప్రశంసనీయం

వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్‌హసన్



బాయ్స్ హాస్టల్‌ను ప్రారంభించిన వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: మనూ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం, యూజీసీ పాత్ర ప్రశంసనీయమని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కొత్తగా నిర్మించిన బాయ్స్ హాస్టల్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాంపస్‌లోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని విద్యార్థి సంఘంకు సూచించారు. అనంతరం హాస్టల్ ప్రాంగణంలో వీసీ మొక్క నాటారు.

సౌకర్యాల పరిశీలన

ఉర్దూ విశ్వవిద్యాలయంలో కల్పిస్తున్న సౌకర్యాలను వీసీ హసన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీస్ పరీక్షల అభ్యర్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్, ప్రొఫెసర్లు ముస్తాక్ అహ్మద్ పటేల్, డాక్టర్ వికర్ ఉన్నిసా, డాక్టర్ జమాలుద్దీన్‌ఖాన్, సీపీడబ్ల్యూడీ అధికారులు అశోక్‌కుమార్, నాగేశ్వరరావు, తారీఖ్ అహ్మద్ మసూది, డాక్టర్ షేక్ వసీమ్ షేక్ షబ్బీర్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎండి ఫైజాన్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



సయ్యద్ అలీముద్దీన్‌కు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తదితరులు

హఫీజ్‌పేట్ : ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు.మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌కు చెందిన సయ్యద్ అలీముద్దీన్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన లక్ష రూపాయలు, కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌కు చెందిన మెహరున్నిసాకు రూ.1.50 లక్షల చెక్కులను బుధవారం అందించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రవీందర్ రావు, మోహన్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, ఇబ్రహీం, విమల్‌కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శ్రీనివాస్‌నగర్‌లోని మందుమూల మల్లన్న ఆలయంలో 4 నుంచి 6వరకు జరిగే మల్లన్నస్వామి కల్యాణం, జాతర ఏర్పాట్లను బుధవారం కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు యాదయ్య, బిక్షపతి, గోపాలకృష్ణ, లక్ష్మినారాయణ, జంగయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. కాగా మల్లన్నస్వామి ఆలయ ప్రాంగణంలో బీరప్ప దేవాలయ నిర్మాణానికి కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు.

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర

పటాన్‌చెరు టౌన్: ఐసీడీఎస్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, కోశాధికారి నర్సింహారెడ్డిలు ఆరోపించారు. బుధవారం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పటాన్‌చెరులోని శ్రామిక భవన్ నుంచి సీడీపీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రూప, కల్పన, రాధిక, శమదేవి, సరళ, ఇందిరా, నాగలక్ష్మి, బాలమణి, అనిత, రాణి,ప్రమీల టీచర్లు పాల్గొన్నారు.



సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్

క్రషర్ పనులు వెంటనే నిలిపేయాలి



నిరసనకు మద్దతు తెలుపుతున్న గోదావరి అంజిరెడ్డి

పటాన్‌చెరు టౌన్: కేఎస్‌ఆర్ మైనింగ్ క్రషర్ పనులు వెంటనే నిలిపేయాలని బీజేపీ రాష్ట్ర మాజీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండల పరిధిలోని లక్డారంలో గ్రామస్తులు, యువకులు నిర్వహిస్తున్న నిరసన దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మైనింగ్ క్రషర్ వల్ల పంటలు సరిగ్గా పండటం లేదన్నారు. క్రషర్లు తిరిగే వాహనాల వల్ల వెలువడే దుమ్ముతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. వెంటనే క్రషర్ పనులు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి

స్వచ్ఛ సర్వేక్షణ్ సమావేశంలో జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్–2023పై జోనల్ కమిషనర్ వి.మమత పవర్ పాయింట్ ప్రెజంటేషన్‌తో అవగాహన కల్పించారు. జీహెచ్‌ఎంసీకి మంచి ర్యాంక్ రావడానికి చేపట్టాల్సిన పనులపై సంబంధిత అధికారులకు వివరించారు. స్వచ్ఛ ఆటోలకు రెండు కంపార్ట్‌మెంట్‌లతో పాటు పై కప్పు ఉండేలా చూడాలన్నారు. నాలాలు, చెరువులు, కుంటల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయాల నుంచి వచ్చే పూలతో వస్తువులను తయారు చేయటం.. చెట్ల ద్వారా వచ్చే చెత్తపై ఎరువులు తయారు చేయటం... భవన నిర్మాణ వ్యర్థాలను తిరిగి వాడటంపై అవగాహన కల్పించారు. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను నిషేధించామన్నారు. అదే విధంగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్తీ దవాఖానాలు, అన్నపూర్ణ క్యాంటీన్‌లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కమిషనర్లు, శానిటేషన్, డీసీలు, సహా వైద్యాధికారులు, ఈఎ స్‌లు, జవాన్లు, ఎస్ఎఫ్ఎ, ఎస్ఆర్‌పీ, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

అల్విన్‌కాలనీ: పెంపుడు జంతువులు, మూగజీవాలతో ప్రేమగా మెలగాలని.. వాటి పట్ల దురుసుగా ప్రవర్తిస్తే వాటి రక్షణ కోసం దాడులు చేస్తాయని.. జాగ్రత్తగా వ్యవహరించాలని కూకట్‌పల్లి ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహులు సూచించారు. బుధవారం కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డిప్యూటీ కమిషనర్ సూచనల మేరకు వీధికుక్కలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుక్కలు వీధుల్లో తిరుగుతున్నప్పుడు వాటిని బెదిరించొద్దన్నారు. తినుబండారాలు తీసుకొని వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే చిన్నారులను వీధుల్లో ఒంటరిగా తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. వీధి కుక్కలు దాడికి దిగడానికి వస్తే పరుగులు తీయకుండా అక్కడే నిల్చుంటే అవి ఏమీ అనవన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహులు, విద్యార్థులు